రోడ్డు వెడల్పు సగం.. సగమే..

● పార్కింగ్‌కు అడ్డా గా మారిన రోడ్డు
● అసంపూర్తి రోడ్డులో వెలసిన చిరు వ్యాపారాలు
● కాలనీలకు తీరని కష్టాలు


వెడల్పు చేసి వదిలేసిన రోడ్డు

మేడ్చల్: మేడ్చల్ ప్రభుత్వ ఐటీఐ వద్ద జాతీయ రహదారి నుండి బాలాజీ నగర్ వరకు ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది. ఇరుకు రోడ్డును వెడల్పు చేస్తామని చేపట్టిన వెడల్పు కార్యక్రమం సగంలోనే నిలిచిపోయింది. జాతీయరహదారి నుండి కోర్టు, బాలాజీనగర్, కెఎల్ఆర్ నగర్, రాఘవేంద్రనగర్ మీదుగా అత్వెల్లి శాంతాబయోటెక్ వరకు సింగిల్ రోడ్డు ఉండేది. కాలనీలు పెరగడంతో రాకపోకలు పెరిగి వాహనాల రద్దీ ఎక్కువగా తయారైంది. వాహనాల సంఖ్య, రాకపోకలు పెరగడంతో రోడ్డు వెడల్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో జాతీయరహదారి పక్కనే ఉన్న ఐటీఐ ఉండటంతో అధికారులు 2021 సెప్టెంబర్‌లో ఐటీఐ ప్రహరీని కూల్చి దాదాపు అరెకరం స్థలం తీసుకుని తిరిగి ప్రహరీని నిర్మించారు. దీంతో కోర్టు చివరి వరకు రోడ్డు రూ.38 లక్షల వ్యయంతో వెడల్పుగా మారింది. రోడ్డు వెడల్పు పనులను నాటి మంత్రులు మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి మూడెళ్ళ క్రితం సెప్టెంబర్ 8న ప్రారంభించారు. నాటి సమావేశంలోనాటి మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ నాటి సీఎం కేసీఆర్‌ను ఒప్పించి రోడ్డు వెడల్పు కార్యక్రమాన్ని చేపట్టామని అందమైన రోడ్డును నిర్మిస్తామని పలికారు. కాలనీలకు అందమైన రోడ్డు వేస్తామని చెప్పిన అమాత్యుల మాటలు వారి పదవి కాలం ముగిసి మాజీలుగా మారినా పనులు మాత్రం సాగలేదు. ఏళ్ళు గడుస్తున్నా రోడ్డు వెడల్పు కార్యక్రమ ప్రారంభమానికి రోడ్డు ఎలా ఉందో అలాగే ఉంది. ఐటీఐ స్థలం ఎక్కడి వరకు వరకు ఉందో అక్కడి వరకు గోడలను ధ్వంసం చేసి మట్టిని నేర్పి కంకర పోసి వదిలేశారు. బాలాజీ నగర్ లో రోడ్డు వెడల్పు చేస్తారా లేదా అన్న విషయం మున్సిపల్ అధికారులు స్పష్టం చేయకపోవడంతో రోడ్డు వెడల్పు ఉంటుందా లేదా అనే మీమాంసలో బాలజీనగర్ రోడ్డు పక్క ఉన్న ఇళ్ళు ఉన్న వారు బిక్కుబిక్కుమంటున్నారు.

శ్రద్ధ చూపని కౌన్సిల్...

వెడల్పు కోసం సగం వెడల్పు చేసిన రోడ్డు అంత రాష్ట్ర రోడ్డు కాదు, జెడ్పీ, ఆర్అండ్‌బీ, ఎన్‌హెచ్ ఇలా ఏది కాదు. కేవలం మున్సిపల్ రోడ్డు. సగం వెడల్పు చేసి ఎందుకు ఉపయోగం లేకుండా చేసిన రోడ్డుపై మున్సిపల్ కౌన్సిల్ ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదు. జాతీయ రహదారి నుండి శాంతాబయోటెక్ కంపెనీ వరకు పూర్తిగా రోడ్డు వెడల్పు చేస్తే నాలుగైదు కాలనీలకు పూర్తిగా ట్రాఫిక్ సమస్య తీరడంతో పాటు ఆ ప్రాంతాలు మరింత వేగంగా అభివృద్ధి చెందె అవకాశాలు ఉన్నాయి. రావల్‌కోల్ మేడ్చల్ రూట్ కు మెరుగైన రవాణా సౌకర్యం ఏర్పాటు అవుతుంది. గతంలో మొదలుపెట్టిన పనులను ఇప్పటికైనా పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

పార్కింగ్ అడ్డాగా.. చిరు వ్యాపారాలకు కేంద్రంగా..

కోర్టు ముందు మాత్రమే వెడల్పు చేయడంతో కోర్టు కు వచ్చే వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంది. కోర్టుకు వచ్చే వారు ఇతర ప్రాంతాలకు వెళ్లే వారికి వెడుల్ప చేసిన రోడ్డు పార్కింగ్‌కు అడ్డాగా మారింది.జాతీయ రహదారి పక్కనే వెడుల్పు చేసిన రోడ్డు ఉండటంతో అక్కడ చిరు వ్యాపారాలు వెలిశాయి.కొబ్బరి బోండాల దుకాణాలు, మొబైల్ టిఫిన్ సెంటర్‌లను ఇతర చిరు వ్యాపారాలు వెలిశాయి. ఐటీఐ ప్రహరీ కూల్చి ఐటీఐ స్థలంలో రోడ్డు వేసి వెడల్పు పనులు పూర్తి చేయకపోవడంతో అధికారులు ఏం సాధించారో అర్థం కాని పరిస్థితి. కోర్టు ముందు ఉన్న ట్రాఫిక్ సమస్య తీరినా కోర్టు నుండి దిగువకు వెళితే సమస్య యదావిధిగా ఉంది. రోడ్డు వెడల్పు అవసరం ఉన్నప్పటికీ కొద్ది మేర వెడల్పు చేసి కనీసం రోడ్డు నిర్మించకుండా వదిలేయడంలో అంత్యర్యమేమిటో . అసంపూర్తిగా రోడ్డు వదిలేయడంతో వెడల్పు చేసిన రోడ్డు కొద్ది మందికి మినహ ఎవరికి ఉపయోగం లేకుండా పోయింది.జాతీయరహదారి నుండి కెఎల్ఆర్ కమాన్ వరకు రోడ్డు వెడలుప చేస్తే ఐదారు కాలనీలకు ట్రాఫిక్ సమస్య తీరుతుంది.


అసంపూర్తి రోడ్డులో వెలసిన చిరు వ్యాపారాలు

బిట్స్ పిలానీలో వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్స్

జవహర్‌నగర్: బిట్స్ పిలానీ క్యాంపస్‌లో వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్స్ ఎంటెక్, ఎంబీఏ, ఎమ్మెస్సీ, బీటెక్‌లో చేరేందుకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని బిట్స్ ఫిలానీ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆధునిక వ్యాపారాలు ఉత్పత్తులు, డిజిటల్ సాంకేతికతలను అందిపుచ్చుకునేందుకు వర్క్ ఇంటిగ్రేటెడ్ కోర్సులు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ నెల 22 నుంచి జూన్ 17 వరకు అడ్మిషన్లు జరుగుతాయని, ఆసక్తి గల ప్రొఫెషన ల్స్ బిట్స్ పిలానీ క్యాంపస్‌లో సంప్రదించాలని కోరారు.

వర్షాకాలానికి ముందస్తు చర్యలు చేపట్టాలి


జవహర్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడుతున్న కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి

జవహర్‌నగర్: వర్షాకాలనికి ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను జవహర్‌నగర్ కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాబోయేది వర్షాకాలమని లోతట్టు ప్రాంతాలలో ఇండ్లను ఇప్పుడే గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. విధుల్లో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తే సహించేదిలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు సత్వర పనులు అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఈ మాదవచారి, ఏఈ రాజశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, శ్రీదేవి, ఎల్లమ్మ, రజనీ, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాయి, తిరుపతి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం సాల్వ్ ఫర్ టుమారో..

సాక్షి, సిటీబ్యూరో: పాఠశాల విద్యార్థుల కోసం సంక్లిష్టతలను పరిష్కరించే సామర్థ్యంతో పాటు, ఇతరత్రా స్కిల్స్‌ను అందించేందుకు ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల బ్రాండ్ శామ్‌సంగ్.. సాల్వ్ ఫర్ టుమారో పేరిట పలు విద్యా సంబంధ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. దీనిలో భాగంగా పాఠశాల విద్యార్థులకు డిజైన్ థింకింగ్ వర్క్‌షాప్స్ ఏర్పాటు, కమ్యూనిటీ ఛాంపియన్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు ఉపయుక్తమైన వస్తువులతో పాటు పాఠశాలకు రూ.25 లక్షల వరకూ గ్రాంట్ అందించనున్నట్లు వివరించారు.

పాలీసెట్ ఎంట్రన్స్‌కు ఏర్పాట్లు పూర్తి

రామంతాపూర్: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలోని ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సుల కోసం ఈ నెల 24న శుక్రవారం నిర్వహించే పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పాలీసెట్) ప్రవేశ పరీక్ష కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మేడ్చల్ జిల్లా పాలిసెట్ కో ఆర్డినేటర్ రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహించే ఈ పరీక్షకు ఉప్పల్ నియోజకవర్గంలోని విద్యార్థుల కోసం ఈ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పరీక్ష కేంద్రాలు ఇవి. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల రామంతాపూర్, మెగా ఉమెన్స్ డిగ్రీ కళాశాల పెద్ద చెరువు ఎదురుగా రామంతాపూర్, స్ఫూర్తి మహిళా డిగ్రీ కళాశాల లక్ష్మీనగర్, రామంతాపూర్, ప్రిన్స్టన్ డిగ్రీ కళాశాల శారదానగర్ రామంతాపూర్, ప్రిన్సిటన్ పీజీ కళాశాల శారదానగర్, రామంతాపూర్, వాగ్దేవి మహిళా డిగ్రీ కళాశాల డిమార్ట్ వెనుక రామంతాపూర్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని అభ్యర్థులు ఉదయం 10 గంటలకే పరీక్ష కేంద్రాలకు హాజరుకావాలని ఆయన సూచించారు. మొత్తం ఆరు పరీక్షా కేంద్రాల్లో 2,908 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ఆదరణ



బోడుప్పల్: కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీల పట్ల ప్రజల్లో రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. బోడుప్పల్ బీఆర్ఎస్ కార్పొరేటర్ జక్క పద్మ దంపతులు బుధవారం ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి తీసుకొచ్చిన ఆరు గ్యారెంటీలపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేసి వాటి ఫలాలను అర్హులైన వారికి అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొత్త చందర్‌గౌడ్, బొమ్మక్ సుగుణ బాలయ్య, మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆరోగ్యం కోసం అన్ని జాగ్రత్తలు

బోడుప్పల్: ఆర్టీసీ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అన్ని విధాలుగా జాగ్రత్తలు తీసుకుంటోందని చెంగిచర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ కవిత అన్నారు. చెంగిచర్ల ఆర్టీసీ డిపోలో బుధవారం టీజీఎస్ ఆర్టీసీ గ్రాండ్ హెల్త్ చాలెంజ్ కార్యక్రమంలో భాగంగా ఉద్యోగుల కోసం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగులు ఆరోగ్యవంతంగా ఉండి విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని సూచించారు. వైద్య శిబిరంలో ఆర్టీసీ ఉద్యోగులకు బీపీ, షుగర్, రక్త, ఈసీజీ పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈసీజీలు, బీపీ ఎక్కువ ఉన్న వారిని తార్నాకలోని టీజీఎస్ ఆర్టీసీ ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. వైద్య శిబిరంలో డాక్టర్ శ్రీధర్, అసిస్టెంట్ మేనేజర్లు ఆనందరావు, సుబ్రహ్మణ్యం, సూపరింటెండెంట్ రత్నమ్మ, డిప్యూటీ సూపరింటెండెంట్ బీఆర్‌పీ లక్ష్మి పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడు శ్రీకాంత్‌రెడ్డిపై కేసు నమోదు

పోచారం: కాంగ్రెస్ పార్టీ నాయకుడు సింగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డిపై కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రాజు తెలిపిన మేరకు.. ఈ నెల 3న అన్నోజిగూడలో జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్న కొంతం శంకర్‌రెడ్డిపై శ్రీకాంత్‌రెడ్డి చేయిచేసుకుని అసభ్య పదజాలంతో దూషించాడు. తన తండ్రిపై ఎందుకు దాడి చేశావని శంకర్‌రెడ్డి కొడుకు కిరణ్‌రెడ్డి ప్రశ్నించడంతో అతనిపైనా శ్రీకాంత్ దాడి చేశాడు. దీనిపై ఈ నెల 8న పోచారం పోలీస్ స్టేషన్‌లో కిరణ్‌రెడ్డి ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో కోర్టును ఆశ్రయించాడు. కోర్టు ఆదేశాల మేరకు శ్రీకాంత్‌రెడ్డిపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు.

నీటి నమూనాలు సేకరించిన అధికారులు


నీటినమూనాలు సేకరిస్తున్న అధికారులు

ఘట్‌కేసర్: ఏదులాబాద్ చెరువులో కలుషిత నీరు చేరి చేపలు మరణించిన ఘటనపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులు స్పందించారు. బుధవారం కాలుష్య నియంత్రణ మండలి ఏఈ శరత్‌చంద్ర, అసిస్టెంట్ ఎన్విరాన్మెంట్ సైంటిస్ట్ మహేశ్‌ల బృందం ఏదులాబాద్ చెరువును సందర్శించి చెరువులోని నీటి నమూనాలు సేకరించారు. నీటిని పరిశీలనలు చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఏదులాబాద్ చెరువులో కాలుష్య నివారణకు కాలుష్య నియంత్రణ మండలి వీలైనంత త్వరగా కార్యాచరణ రూపొందించాలని, కాలుష్యాన్ని అరికట్టాలని ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి కోరారు. అధికారుల బృందంతో కలిసి నీటిని పరిశీలించారు. పరిశీలనలో మాజీ సర్పంచ్ శంకర్, వార్డు సభ్యులు సురేశ్, గంగపుత్ర సంఘం అధ్యక్షులు యాదగిరి, గంగపుత్రులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత


జవహర్‌నగర్‌లోని అరుంధతినగర్‌లో ఇళ్లు, గుడిసెలను తొలగించిన రెవెన్యూ అధికారులు

జవహర్‌నగర్: సర్కారు జాగాను కబ్జా చేస్తే సహించేదిలేదని కాప్రా తహసీల్దార్ సుచరిత హెచ్చరించారు. జవహర్‌నగర్‌లోని అరుంధతినగర్ ప్రాంతంలో అక్రమంగా నిర్మించిన ఇండ్లను, గుడిసెలను బుధవారం జేసీపీ సహాయంతో పోలీసుల బందోబస్తు నడుమ కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుచరిత మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కబ్జా చేయాలని ప్రయత్నిస్తే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకోబోమని అటువంటి వారిని గుర్తించి పీడీయాక్ట్‌లు నమోదు చేస్తామన్నారు. ఇప్పటికే చాలా మందిపై కేసులు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. సీఐ నాగరాజు, అడ్మిన్ ఎస్ఐ ఇద్రీస్ అలీ, ఎస్ఐలు అనిల్‌కుమార్‌యాదవ్, అనిల్‌రెడ్డి, కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి, డిప్యూటి తహసీల్దార్ రాధిక, ఆర్ఐ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బాలాజీ వేంకటేశ్వరస్వామి రథోత్సవం



శామీర్‌పేట్: అంగరంగ వైభవంగా శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి రథోత్సవం బుధవారం నిర్వహించారు. మూడుచింతలపల్లి మండలం, కేశవరం గ్రామంలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 4 గంటలకు రథోత్సవం నిర్వహించారు. గ్రామంలోని వీధుల స్వామి వారి నామస్మరణలతో మార్మోగాయి. గ్రామ పెద్దలు, యువకులు పెద్దసంఖ్యలో రథోత్సవంలో పాల్గొన్నారు.

శిథిల భవనంలో తహసీల్దార్ కార్యాలయం



మేడ్చల్: ఒక వైపు కొన్ని శాఖలలో అవసరం లేకున్నా అదనపు భవనాలు నిర్మిస్తూ తమ శాఖల కార్యాలయాల కోసం సువిశాల భవనాలు ఏర్పాటు చేసుకుంటుంటే మండల రెవెన్యూ కార్యాలయం మాత్రం నిజాం కాలం నాటి శిథిల భవనంలో కొనసాగుతూ మేడ్చల్ అభివృద్ధిని వెక్కిరిస్తోంది. మేడ్చల్ పట్టణ నడిబొడ్డున మండల తహసీల్దార్ కార్యాలయం ఉంది. ఈ కార్యాలయం భవనం నిజాం కాలంలో అశ్వాలశాల కోసం నిర్మించిన భవనం కాలక్రమేణా అందులో మొదటి నుండి మండల రెవెన్యూ కార్యాలయం కొనసాగుతూ వచ్చింది. ఈ భవనంలో ఉన్న సమితి కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్, టెలికాం కార్యాలయాలు భవనం పాతది కావడంతో నూతన భవనాల్లోకి ఎన్నో ఏళ్ళ క్రితమే మారిపోయాయి. అందమైన భవనాల్లో నేడు కొనసాగుతున్నాయి. రెవెన్యూ కార్యాలయం మాత్రం పాత శిథిల భవనంలోనే కొనసాగుతుంది. కార్యాలయంలో ఉన్న గదులు శిథిలం కావడంతో కార్యాలయం ఇరుకుగా మారింది. అధికారులకు అందరికీ సరిపడా గదులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. రికార్డు గది పూర్తిగా శిథిలం కావడంతో రికార్డులకు భద్రత లేకుండాపోయింది. వర్షం కురుస్తుండటంతో నీళ్ళు రికార్డుల్లోకి వెళుతుండటంతో రికార్డులకు భద్రత కరువవుతుంది. అధికారులు ఎప్పటికప్పుడు మరమ్మత్తులు చేసి భవనం ను కాస్త జాగ్రత్తగా నిర్వహిస్తున్న పాత భవణం కావడంతో ఎప్పటికైనా ముప్పే.

జాడలేని పక్కా భవనం

ఉమ్మడి రాష్ట్ర చివరి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి మేడ్చల్ తహసీల్దార్ కార్యాలయ పక్కా భవనం కోసం 2014 లో శంకుస్థాపన చేసిన అది ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు. కనీసం శిలాఫకలకం జాడకూడా కనిపించడం లేదు. కనీసం స్థలం ఎక్కడ కేటాయించారో తెలియని పరిస్థితి నెలకొంది. పాత భవణంలో సువిశాల స్థలం ఉండటంతో ఆ ప్రాంతంలోనేనూతన భవనం నిర్మించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

ఖాళీ స్థలాలు.. అపరిశుభ్రతకు నిలయాలు

● కాలనీల్లోని ఖాళీ స్థలాల్లో పేరుకుపోతున్న చెత్త, చెదారం
● ఓనర్ల నిర్లక్ష్యం.. పట్టించుకోని అధికారులు
● దోమల నిలయంతో ప్రబలుతున్న అనారోగ్య సమస్యలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: జనావాసాల్లో ఖాళీ స్థలాలు మురికి నీటితో గుంతలుగా మారి కంపు కొడుతున్నాయి. ఓనర్ల నిర్లక్ష్యం..అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రజలకు పాట్లు తప్పడం లేదు. వర్షాకాలం ముందే వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఇటీవల పెద్ద వానలు కురువగా...మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని పలు పురపాలికల్లో వరద సమస్య కూడా ప్రారంభమైంది. దీంతో పురపాలికల్లోని ఖాళీ స్థలాలతో సంబంధిత కాలనీ వాసులు తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఖాళీ స్థలాలు, ప్లాట్లల్లో ముళ్లపొదలు, చెదారం పేరుకు పోవటంతోపాటు మురుగు, వర్షం నీరు నిలిచి దోమలు విజృంభిస్తున్నాయి. అపరిశుభ్రత వెక్కిరిస్తోంది. పురపాలిక చట్టం ప్రకారం ఖాళీ స్థలాల్లో ఎలాంటి ముళ్ల పొదలు పెరగకుండా, అపరిశుభ్రత లేకుండా యజమానులు చూసుకోవాల్సి ఉంటోంది. లేదంటే అధికారులు స్థలం యజమానికి నోటీసులు ఇచ్చి శుభ్రం చేయించాలి. కానీ జిల్లా పరిధిలోని జీహెచ్ఎంసీ సర్కిళ్లతోసహా 13 పురపాలికలలోని పలు కాలనీల్లో ఖాళీ ప్లాట్లు అపరిశుభ్రతకు నిలయంగా నిలుస్తున్నాయి. భావి అవసరాల దృష్ట్యా కొందరు ఇళ్ల స్థలాలను కొని వదిలేస్తున్నారు. ఆయా కాలనీల్లో గృహ నిర్మాణాలు ఊపందుకుని, ప్లాట్లకు విలువ పెరిగిన తర్వాత చూద్దాంలే అనుకొని ఏళ్ల తరబడి వదిలేయడంతో చెత్త, ముళ్లకంప చెట్లు పెరిగి దోమలకు నిలయాలవుతున్నాయి. జిల్లాలో ఉప్పల్, మల్కాజిగిరి, అల్వాల్, కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిళ్లతోపాటు జవహర్ నగర్, బోడుప్పల్ ,పీర్జాదిగూడ, పోచారం, ఘట్కేసర్, నాగారం, దమ్మాయిగూడ, గుండ్ల పోచంపల్లి, తూముకుంట పురపాలక సంఘాల్లో ఇటీవల కురిసిన వర్షాలతో కాలనీలు ,లోతట్టు ప్రాంతాల్లో నీళ్ల నిలిచి దోమలు పెరగడంతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ ,వైరల్ జ్వరాలు ప్రబలుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

రిజిస్ట్రేషన్‌తో సరి..

ప్లాట్లు ఖరీదు చేసేవారు రిజిస్ట్రేషన్ తర్వాత పురపాలికల్లో తమ పేరిట ఆస్తి మార్పిడి చేయించుకోవాలి. దీని వల్ల డబుల్ రిజిస్ట్రేషన్ ప్రమాదాన్ని నివారించవచ్చు. ఆస్తి మార్పిడితో సదరు స్థలం ఆస్తి పన్ను పరిధిలోకి వస్తోంది. దీన్ని తప్పించుకునేందుకు మ్యుటేషన్‌కు దూరంగా ఉంటున్నారని అధికారులు అంటున్నారు. ఖాళీ స్థలాల మ్యుటేషన్, అసెస్‌మెంట్‌పై దృష్టిసారిస్తే, ఖాళీ స్థలాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారికి నోటీసులు జారీ చేయవచ్చు. నోటీసుకు స్పందించని చోట, పురపాలికల ఆధ్వర్యంలో శుభ్రపర్చి సదరు ఖర్చులను వసూలు చేసే అవకాశం ఉంది. అప్పటికీ స్పందించని పక్షంలో స్వాధీనం చేసుకుని, రుసుం చెల్లించేదాకా నిర్మాణ అనుమతులను నిరాకరించవచ్చు. నిబంధనల అమలుపై పురపాలక సంఘాల అధికారులు దృష్టి పెట్టాల్సిఉంది.

ప్రభుత్వ స్థలాల్లోనూ ఇదే పరిస్థితి..

ప్రైవేటు ప్లాట్ల సంగతి ఇలా ఉంటే ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, అంతర్గత, ప్రధాన రహదారుల వెంట ఉన్న గ్రీన్ బెల్టు తదితర స్థలాలు చెత్తకుండీలుగా మురుగునీటి నిలయాలుగా మారుతున్నాయి. పందులు, కుక్కలకు ఈ ప్రాంతాలు ఆవాసాలుగా మారుతున్నాయి. నిర్మాణ వ్యర్థాలను, భోజన, ప్లాస్టిక్ వ్యర్థాలను ఈ దారిలో పడేస్తున్నారు. ప్రతి ఏటా పట్టణ ప్రగతి, ఇతర ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల అమలు సందర్భంగా వీటిని శుభ్రం చేసేందుకు రూ. లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది.

ఘనంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి

సాక్షి, మేడ్చల్ జిల్లా: జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో దళిత వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మ 136 వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి జి. వినోద్ కుమార్,క లెక్టరేట్‌లో వివిధ విభాగాల సిబ్బంది పాల్గోన్నారు.ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఆంధ్ర సభ స్థాపకుడు భాగ్యరెడ్డి వర్మ గొప్ప సంఘసంస్కర్త అన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలతో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది ఘన నివాళులర్పించారు.

నేడు పలుచోట్ల పవర్‌కట్



కీసర: 11కేవీ చీర్యాల లక్ష్మీ విద్యుత్‌ఫీడర్ మరమ్మతు పనుల కారణంగా నేడు (గురువారం) ఉదయం 11 నుండి మధ్యాహ్నం 1 వరకు సాయినగర్, వికలాంగులకాలనీ, వీఆర్ఆర్ హోమ్స్, సాయికాలనీ, హిడెన్‌గార్డెన్, విజ్ఞాన్ డెవలపర్స్, చాముండిపట్నం తదితర కాలనీల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్‌ఏఈ మురళీకృష్ణ తెలిపారు.

◆ యాద్గార్‌పల్లి విద్యుత్‌ఫీడర్ మరమ్మత్తుపనుల కారణంగా మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 5 గంటలవరకు యాద్గార్‌పల్లి గ్రామం,ఓఆర్ఆర్ టూ షామిర్‌పేటరోడ్డు, గోశాల, ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఈవిషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

◆ నాగారం మున్సిపాలిటీలో: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 11కేవీ సాయిబాబాటెంపుల్ విద్యుత్‌ఫీడర్ మరమ్మత్తుపనుల కారణంగా గురువారం ఉదయం 11 గంటలనుండి మధ్యాహ్నం 1 గంటవరకు సాయిబాబాకాలనీ, ఈస్ట్‌గాంధినగర్, సాయిమహిమానగర్, నేతాజీనగర్, హనుమకొండకాలనీ, గౌరీఎన్‌క్లేవ్, లోకేశ్వర్‌నగర్, అన్నపూర్ణకాలనీ, కాలనీలో,మధ్యాహ్నం 3 గంటలనుండి సాయంత్రం 5 వరకు సాయిశ్రీజకాలనీ, మాదిరెడ్డిమల్లారెడ్డి, సాయిసంజీవనగర్, అరవిందర్‌నగర్, సాయిదుర్గకాలనీ, మణిఎన్‌క్లేవ్, ఎస్ఎల్ఎన్‌కాలనీ,తీవారీకాలనీ, జీఎస్ఆర్‌గార్డెన్, ఈస్ట్‌గాంధినగర్, రాంపల్లిఎక్స్‌రోడ్డు, హనుమాన్‌నగర్, కాలనీలో విద్యుత్‌అంతరాయం ఉంటుందని నాగారం విద్యుత్ ఏఈ కామేశ్వర్‌రావు తెలిపారు.

◆ దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని రాజిరెడ్డినగర్, శ్రీనివాస్‌నగర్ కాలనీఫేస్ 1,2 ,పిఎస్ రావునగర్ ఎక్స్‌టెన్షన్ ,దమ్మాయిగూడ ఓల్డ్‌విలేజ్, వివిఎస్ ఎన్‌హోమ్స్, కాలనీల్లో ఉదయం 11.30 నుండి మధ్యాహ్నం 1 గంటవరకు , 11 కేవీ విద్యుత్ భువనరుషి విద్యుత్‌ఫీడర్ మరమ్మత్తుపనుల కారణంగా మధ్యాహ్నం 3.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు సాయిపురికాలనీ, ఎస్సార్‌కాలనీ, సిద్దార్థనగర్, సాయిబృందావన్, ఈశ్వరయ్యకాలనీ, సాయితిరుమల కాలనీ, మారుతీనగర్‌రోడ్డు 3 వెంకటరమణ కాలనీల్లో విద్యుత్‌అంతరాయం ఉంటుందని దమ్మాయిగూడ విద్యుత్‌సబ్‌స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్: రావల్‌కోల్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత కారణంగా నేడు పలు ప్రాంతాలలో కరెంట్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పవన్ చంద్ తెలిపారు. రావల్‌కోల్ పరిధిలోని అన్ని పరిశ్రమలకు ఉదయం 8 గంటలకు మధ్యాహ్నం 2 గంటలకు వరకు కరెంట్ సరఫరా ఉండదని ఏఈ చెప్పారు.

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీలో గురువారం అంతరాయం కలగనున్నట్లు బాలాజీనగర్ ఏఈ వీరన్న ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ చెన్నాపురం ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలను కత్తిరించడం , విద్యుత్ లైన్ల మరమ్మతుల పనుల కారణంగా గురువారం ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిలివేస్తున్నట్లు తెలిపారు. చెన్నాపురం, లక్ష్మీనగర్‌కట్ట, నెహ్రూనగర్, శివనర్, జయశంకర్‌కాలనీ, లెప్రసీ కాలనీ, మదర్‌థెరిస్సా కాలనీ, శాంతినగర్, బీరప్పగడ్డ, వీరభద్ర కాలనీ, ఆదర్శనగర్, ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం కలగనున్నట్లు తెలిపారు.

మేడ్చల్ రూరల్: చెట్ల తొలగింపు కారణంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలలో విద్యుత్ అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఏఈ వెంకటేశ్ గౌడ్ తెలిపారు. 11కేవీ నైబర్‌హుడ్ ఫీడర్ పరిధిలో ఉదయం 9.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు లక్ష్మీనగర్ కాలనీ, ఊర్జిత విల్లాస్, మాణిక్‌రెడ్డి నగర్, ఎస్ఎల్ఆర్ కాలనీ, నేబర్ హుడ్ విల్లాస్, ఏజీ కాలనీ లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

శామీర్‌పేట్: నేడు తూంకుంట మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని శామీర్‌పేట ఏఈ రమేష్ బుధవారం తెలిపారు. పోతాయిపల్లి ఫీడర్, 11కేవీ డీఎంసీ ఫీడర్, ఎన్‌టీజీ పరిధిలోని మరమత్తు పనులు చేపడుతున్నామన్నారు. దీంతో పోతాయిపల్లి, దేవరయాంజాల్ గ్రామాల పరిధిలో ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాను నలిపి వేస్తున్నట్లు వివరించారు.

పోచారం: సబ్ స్టేషన్‌లో మరమ్మతులు, వైర్లకు తాకుతున్న చెట్ల కొమ్మల తొగింపు పనులు చేపట్టడంతో గురువారం పలు కాలనీలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. ఉదయం 11 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఇన్ఫోసిస్ హాస్టల్స్, సెరీన్ హిల్స్, శివాలయం పరిసర ప్రాంతాలు, పోచారం గ్రామం, అన్నానగర్, నాగారంలోని డబుల్ బెడ్‌రూమ్స్, ఏవీ కన్‌స్ట్రక్షన్స్, అగాపే ఆర్ఫానేజ్, సంస్కృతి టౌన్‌షిప్‌లో ఎ1 నుండి ఎ50, సీ1 నుండి సీ10, డీ1 నుండి డీ4 బ్లాకులకు, అన్నోజిగూడ, ఎల్ఎన్ కాలనీ, ఎల్ఐజీ, జైపురి కాలనీ, సత్యానగర్, సాయినగర్, ఇందిరానగర్, ఆర్జీకే, ఆర్ఎన్ఆర్ హైట్స్, మయూరి డెవలపర్స్, ఎమరాల్డ్ హైట్స్, సూర్య నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

◆ జోడిమెట్ల ఫీడర్ పరిధిలోని అన్నానగర్, డాక్టర్స్ కాలనీ, జోడిమెట్ల క్రాస్ రోడ్, అరుంధతి కాలనీ, హుడా కార్తికేయ, కాకతీయ నగర్, స్వర్ణగిరి, వాసవికాలనీ, చౌదరిగూడ ప్రాంతాలకు మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.